క్లుప్తంగా

16న చలో అనంతపురం



మాట్లాడుతున్న నాగేంద్రనాథ్

నల్లమాడ: ఈనెల 16న హలో మాదిగ..చలో అనంతపురం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఆఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్ తెలిపారు. శనివారం స్థానిక ఎస్సీ కాలనీలో ఆయన మాట్లాడుతూ ఉద్యమ పోరాట ఫలితంగా సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. అనంతపురంలోని లలిత కళా పరిషత్‌లో జరిగే మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో మాదిగ, ఉప కులాల నాయకులు, ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కాలనీవాసులు గంగరాజు, రామ్మూర్తి, అంజినప్ప, పెద్దప్పయ్య, ఎస్సీ నరసింహులు, రామచంద్ర, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతి చెందిన మద్దిలేటి

బత్తలపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మరుగుజ్జు వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ధర్మవరం మండలం మల్కాపురం గ్రామానికి చెందిన మొండి మద్దిలేటి(39) అనంతపురం టౌన్ ఉప్పరపల్లి వద్ద నివాసముంటున్నాడు. ఈ నెల 3న తన తల్లి పెద్దక్కను చూడటానికి మూడు చక్రాల హోండా బైకుపై స్వగ్రామానికి బయలుదేరాడు. ఈదుల ముష్టూరు క్రాస్ వద్ద రోడ్డు దాటుకుంటున్న బైకును కదిరి నుంచి అనంతపురం వెళ్తున్న కారు ఢీ కొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మద్దిలేటిని స్థానికులు ఆర్డీటీ ఆసుపత్రికి తర్వాత అనంతపురం తరలించారు. అక్కడి నుంచి బెంగళూరుకు తరలించారు. అక్కడి వైద్యులు పరిస్థితి విషమంగానే ఉందని అనంతపురం తీసుకెళ్లాలని సూచించారు. తర్వాత అనంతపురం తీసుకొచ్చారు. చికిత్స ఫలించక పోవడంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి పెద్దక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భగవద్గీత శ్లోకాలపై పోటీలు




కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటప్రసాద్

కదిరి టౌన్: టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చేతుల మీదుగా భగవద్గీత శ్లోక పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా ఇంచార్జ్‌లు మాట్లాడుతూ డిసెంబర్ 1 నుంచి భగద్గీత శ్లోకాలపై జిల్లా స్థాయి పోటీలు కదిరిలో నిర్వహిస్తామని తెలిపారు. భగవద్గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా ఇంచార్జ్‌లు ధర్మాచార్యులు శేషాద్రి, రామ్మోహన్, నాగేంద్రప్రసాద్, కుటాగుళ్ల నాగరాజు, రాజశేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

కదిరి అర్బన్: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని కదిరి డిపో నుంచి శైవ క్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అసిస్టెంట్ డీఎం హరిత శనివారం తెలిపారు. శ్రీశైలం, అరుణాచలంకు 10,17, 24 తేదీల్లో సర్వీసులు ఉంటాయన్నారు. అలాగే బుగ్గరామలింగేశ్వరస్వామి తాడిపత్రి, యాగంటి, మహానంది, కోటిలింగాలు, ఈషా ఫౌండేషన్(చిక్బళ్లాపూర్)లకు 11,1 8, 25 తేదీల్లో సర్వీసులు నడుపుతామని తెలిపారు. వివరాలకు 9959225892 నంబరులో సంప్రదించాలని సూచించారు.

అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు అందుకున్న అయ్యప్పస్వామి

తాడిమర్రి: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వారు అయ్యప్పస్వామి, మహాగణపతి, లక్ష్మీ, సరస్వతి దేవతల చిత్రపటాలకు పూలమాలలు వేసి అందంగా అలంకరించారు. అనంతరం 108 శరణాలు పలుకుతూ భజనలు చేశారు. అనంతరం కర్పూర, మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

చౌరవ చూపితే ఆదాయమే..

- నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు
- నిధులు 'చెత్తపాలు'
- మందు బాబులకు అడ్డాగా మారుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు





ప్యాదిండిలో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం (ఇన్‌సెట్‌లో) తొట్టెలో పడేసిన మద్యం సీసాలు

చెన్నేకొత్తపల్లి: చెత్త నుంచి సంపద సృష్టించి.. వచ్చే ఆదాయాన్ని పంచాయతీల అభివృద్ధికి వినియోగిస్తామని గొప్పలు చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. కనీసం వాటి గురించి నోరుమెదపడం లేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఈ కేంద్రాల నిర్మాణానికి ఉపాధిహామీ పథకం నిధులు ఖర్చు చేశారు. బ్యాటరీ బండ్లు, మేజర్ పంచాయతీలకు ట్రాక్టర్లు, జనాభా ఎక్కువ ఉంటే ట్రాక్టర్, గాజు సీసాలు పొడి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యంత్రాలు కేటాయించింది. ఈ కేంద్రాల్లో పని చేసేందుకు గత ప్రభుత్వం క్లీన్ మిత్రలను కూడా నియమించింది. వీరు వీధుల నుంచి చెత్తను సేకరిస్తారు. తడి, పొడి చెత్తతో పాటు గాజు, పెంకు, ప్లాస్టిక్‌లుగా వేరు చేస్తారు. వాటిని వేర్వేరు తొట్టిల్లో వేసి కుళ్లించి, వానపాములతో సేంద్రియ ఎరువులు తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇక్కడ తయారైన ఎరువును ప్యాకెట్లుగా తయారు చేసి రైతులకు విక్రయించాలి. కిలో కంపోస్ట్ ఎరువు రూ.8 నుంచి రూ.10 వరకు విక్రయిస్తే ఆదాయం సమకూరుతుంది. తయారైన ఎరువులను రైతులకు విక్రయించాలని పెట్టుకున్న లక్ష్యం నీరుగారింది. సంపద తయారీ కేంద్రాలు షెడ్లకే పరిమితమయ్యాయి. గ్రామాల నుంచి చెత్తను సేకరించి వానపాముల ద్వారా ఎరువుల తయారీ పడకేసింది. ఎక్కడ చూసిన మురుగు కాలువలు, వీధుల్లో చెత్త, ప్లాస్టిక్, గాజు సీసాలు పేరుకుపోతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు.

ప్రజాధనం వృథా..

లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారడంతో అవి మందుబాబులకు స్థావరాలుగా మారాయి. గ్రామాలకు కొంతదూరంలో ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మరుతున్నాయి. కొన్నిచోట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోక పోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. చెన్నేకొత్తపల్లి మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 14 గ్రామ పంచాయతీలకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రభుత్వం 2017–18లో మంజూరు చేసింది. ఒక్కొక్క కేంద్రానికి సుమారు రూ.3.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ వెచ్చించి నిర్మించారు. కనీసం ఖర్చు చేసిన దానిలో కొంత ఆదాయం కూడా రాకుండా పోయిందని ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిపై చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పర్యవేక్షించాలి. చెత్త నుంచి ఆదాయం పెంచుకుని ఆ మొత్తాన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి



చెత్త నుంచి సంపద తయారీ చేసేందుకు షెడ్లను నిర్మించడం బాగుంది. అయితే ఇవి నిరుపయోగంగా ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయి. ప్రభుత్వం చొరవ తీసుకుని సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకుని రావాలి. ఎరువుల తయారీకి ప్రణాళికలు రూపొందించాలి. వర్మీకంపోస్టును తయారు చేసి, స్థానికంగా ఉండే రైతులకు విక్రయించడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చు. ఈ ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేయాలి.

– అంజి, గువ్వలగొందిపల్లి, ముష్టికోవెల

త్వరలో పనులు ప్రారంభిస్తాం



మండలంలో ఉన్న 14 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో త్వరలో పనులు ప్రారంభిస్తాం. గతంలో ఇందులో పని చేసే వారు పని మానేయడంతో పనులు జరగలేదు. త్వరలో పనులను ప్రారంభిస్తాం. కేంద్రాల్లో ఎరువుల తయారీని ప్రారంభించి, పంచాయతీలకు ఆదాయం వచ్చేలా కృషి చేస్తాం.

– అశోక్‌కుమార్ నాయక్, ఈఓఆర్డీ, చెన్నేకొత్తపల్లి మండలం

నేడు ఉషశ్రీ చరణ్ రాక

కదిరి: వైఎస్సార్‌సాపా జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ఆదివారం కదిరికి విచ్చేయనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బి.ఎస్.మక్బూల్ అహ్మద్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు మధ్యాహ్నం 1 గంటలకు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం చేరుకుంటారని, అక్కడ పార్టీ కార్యకర్తలతో మాట్లాడిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడతారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు హాజరు కావాలని మక్బూల్ కోరారు.

'స్థలం పేరుతో మోసం చేశారు'

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

పుట్టపర్తి టౌన్: స్థలం అమ్మకం పేరుతో ఇద్దరు వ్యక్తులు తనను మోసగించారని, తాను వారికిచ్చిన రూ.24 లక్షలను ఇప్పించాలని గాదికుంట శివకేశవ అనే వ్యక్తి పుట్టపర్తి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు..ధర్మవరం రూరల్ మండలం పోతులనాగేపల్లికి చెందిన గాదికుంట శివకేశవ అనే వ్యక్తికి శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సాకే శివయ్య, బ్రాహ్మణపల్లి తండాకు చెందిన రమావత్ చెన్నకేశవనాయక్ పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో సర్వే నంబర్ 115–1ఎ, లో 10 సెంట్ల భూమిని సెంటు రూ.2.4 లక్షల చొప్పున అమ్మేలా అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ మేరకు శివకేశవ సాకే శివయ్యకు రూ.20 లక్షలు ఇచ్చేశాడు. నెలలు గడిచినా స్థలం రిజిస్ట్రేషన్ చేయించకపోవడంతో శివకేశవ వారిపై ఒత్తిడి తెచ్చాడు. తర్వాత మరో రూ.4 లక్షలు తీసుకుని సర్వేనంబర్ 18–5లోని 12 సెంట్లు అమ్మేలా అగ్రిమెంట్ చేసిచ్చారు. తర్వాత శివకేశవ విచారణ చేయడంతో అసలు స్థలం వారి పేరుపై లేదని తేలింది. దీంతో బాధితుడు తాను ఇచ్చిన సొమ్మును ఇవ్వాలని కోరుతున్నా వారు తప్పించుకు తిరుగుతున్నారు. పోలీసులు తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు



ఓటరు నమోదుపై సిబ్బందితో ఆరా తీస్తున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు హక్కు కల్పిస్తామని ఆర్డీఓ మహేష్ పేర్కొన్నారు. శనివారం ఆయన ధర్మవరం పట్టణంతోపాటు రూరల్, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లోని ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 295 పోలింగ్ బూత్‌లలో 127 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో ఫారం–6కు సంబంధించి 60, ఫారం–7కు సంబంధించి 22, ఫారం–8కు సంబంధించి 45 దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు. అర్హులైన యువతీ, యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేష్‌బాబు, ఈడీటీ ఈశ్వరయ్య, సీనియర్ అసిస్టెంట్ రాఘవరెడ్డి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

హిందూపురం: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. శనివారం జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణలో కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ హరీష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఏడీజే మాట్లాడారు. చట్టాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. అలాగే నవ సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు న్యాయస్థానాల ద్వారా ఉచిత న్యాయ సేవా సహాయం అందుతుందన్నారు. ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి న్యాయవాదులు సుదర్శన్, నవేరా, కళావతి తదితరులు బాలికా విద్య, బాల్య వివాహాలు, గృహహింస, ఓటు హక్కు తదితర అంశాలపై వివరించారు. ఽ న్యాయవాదులు సంతోషి కుమారి, అతిక్, రవికుమార్, వీరసేన, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు శ్రీనివాసులు, హరినందబాబు పాల్గొన్నారు.


గర్భిణులకు భోజన వసతి

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని నాగసముద్రం గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం మండలంలోని పలు గ్రామాల్లోని సుమారు 70 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ప్రతి నెల 9వ తేదీన ప్రధానమంత్రి సురక్ష మాతృ అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ తెలిపారు. ఇందులో భాగంగా హైరిస్క్ గర్భిణులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన వారికి చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, సీహెచ్‌ఓ గోవిందమ్మ, పీహెచ్ఎస్ పద్మావతి, సూపర్ వైజర్లు వెంకటనారాయణ, రామలక్ష్మి ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

కనగానపల్లి: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ మండల కన్వీనర్ బిల్లే ముత్యాలు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ నాయకులు, రైతులతో కలసి శనివారం స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడం సరికాదన్నారు. నాయకులు ఆకులేటి నాగేష్, మంజునాథ్, ముత్యాలు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బెయిల్‌పై అమర్‌నాథ్‌రెడ్డి విడుదల



బెయిల్‌పై విడుదలైన అమరనాథ్‌రెడ్డి

కదిరి అర్బన్: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త మలక అమరనాథ్‌రెడ్డి శనివారం బెయిల్‌పై విడుదలయ్యారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫేస్ బుక్‌లో పోస్ట్ పెట్టాడని ఈ నెల 2న పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈనెల 4న స్టేషన్ బెయిల్‌పై విడుదల అయిన అమరనాథ్‌రెడ్డిని సెల్‌ఫోన్ తీసుకెళ్లాలని పిలిపించి మళ్లీ అదుపులోకి తీసుకుని విచారించారు. వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వరెడ్డి చొరవ తీసుకుని అమర్‌నాథ్‌రెడ్డిని బెయిల్‌పై విడుదల చేయించారు.

12 నుంచి రెవెన్యూ గ్రామసభలు

బత్తలపల్లి: భూ సమస్యలపై ఈ నెల 12 నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ స్వర్ణలత తెలిపారు. 12న గరిశలపల్లి, 13న దంపెట్ల, 14న ఓబుళాపురం, 15న సంగాల, 19న అప్పరాచెరువు, చెన్నరాయపట్నం, 20న బత్తలపల్లి, 21న రాఘవంపల్లి, ఈదుల ముష్టూరు, 22న మాల్యవంతం, 26న డి.చెర్లోపల్లిలో గ్రామసభ నిర్వహిస్తామన్నారు. ప్రజలు భూ సమస్యలపై వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సూచించారు.

ముదిగుబ్బ: ఈ నెల 12 నుంచి 27 వరకు మండలంలో రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నారాయణస్వామి శనివారం తెలిపారు. గ్రామసభల్లో భూ సమస్యలు, రస్తా సమస్యలు, రేషన్ కార్డులు, వెబ్ ల్యాండ్ సమస్యలు తదితర వాటిని పరిష్కరిస్తామన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మృతుడి ఆచూకీ లభ్యం

తలుపుల: మండల కేంద్రం ఎగువపేట సమీపంలో పీతురుకుంట కల్వర్టు వద్ద మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభించింది. రూరల్ సీఐ నాగేంద్ర తెలిపిన వివరాలు...తనకల్లు మండలం కొక్కంటి క్రాస్ సమీపంలో గల ముత్యాలవారిపల్లికి చెందిన అంజినప్ప(44) తలుపుల మండలం ఓబులరెడ్డిపల్లిలో తమ బంధువు మృతి చెందడంతో ఈనెల 7న గ్రామానికి వచ్చాడు. అనంతరం కార్యక్రమం ముగించుకుని అదేరోజు ఉదయం 11 గంటలకు తమ స్వగ్రామానికి బయలుదేరాడు. మధ్యాహ్న సమయంలో భార్య ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్‌లో ఉంది. రాత్రయినా ఇంటికి రాలేదు. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు వార్తలు రావడంతో దాన్ని చూసిన భార్య తన భర్త మరణించినట్లు గుర్తించింది. మృతుడికి భార్య సరస్వతి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అంజినప్ప మృతికి కారణాలపై విచారణ చేపట్టినట్లు రూరల్ సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



గాయపడిన సుబ్బమ్మ

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కంబదూరు మండలం తిప్పేపల్లికి చెందిన సుబ్బమ్మ, రామకృష్ణ ద్విచక్ర వాహనంలో స్వగ్రామం నుంచి చెన్నేకొత్తపల్లికి వస్తున్నారు. జాతీయ రహదారి నుంచి చెన్నేకొత్తపల్లిలోకి వెళ్లే క్రమంలో వీరి వాహనాన్ని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో రామకృష్ణకు ఎడమకాలు విరుగగా.. సుబ్బమ్మకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ ఆదాయ పెంపునకు కృషి చేయండి



ఉద్యోగులకు నగదు బహుమతి అందిస్తున్న డీఎం సత్యనారాయణ

ధర్మవరం అర్బన్: ఆర్టీసీ ఆదాయ పెంపునకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ కోరారు. స్థానిక ఆర్టీసీ డిపోలోని గ్యారేజ్‌లో శనివారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. గత నెలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బందికి నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. ఈసందర్భంగా డీఎం మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉద్యోగి పోటీతత్వంతో పనిచేయడంతోపాటు ప్రయాణికుల పట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. డిపో ఆదాయం, కేఎంపీఎల్ పెంచి డిపో అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఉత్తమ కండక్టర్లు ఇరమ్మై, నరసింహులు, జీవీఆర్ రెడ్డి, నాగరాజు, ఎస్ నరసింహులు, డ్రైవర్లు పోలేరప్ప, ఆంజనేయులు, ఏఏ నారాయణకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలను అందించారు.

29న జిల్లాస్థాయి ప్రతిభా పరీక్ష



పోస్టర్ విడుదల చేస్తున్న అశోక్

పుట్టపర్తి టౌన్: వధాన్య సొసైటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 29న జిల్లా స్థాయి ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు సొసైటీ వ్యవస్థాపకుడు అశోక్ పడపాటి తెలిపారు. ఈమేరకు శనివారం పరీక్షకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 ఏళ్ల నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వధాన్య సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేద, నిరాశ్రయ ప్రతిభావంతమైన విద్యార్థుల అభ్యున్నతి కోసం విశిష్ట సేవలు అందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభను తెలికితీసేందుకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. ఏటా 2 వేల మంది విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తున్నామన్నారు. డిసెంబర్ 29న కొత్తచెరువులో జిల్లాస్థాయి ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష వివరాల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వధాన్య.ఓఆర్‌జీలో నమోదు చేసుకోవాలని సూచించారు.

దేవాలయానికి మైక్‌సెట్ వితరణ



మైక్‌సెట్ అందించిన దాతలను సన్మానించిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని కనుముక్కల గ్రామంలో ఉన్న గుమ్మనాథేశ్వర స్వామి ఆలయానికి ధర్మవరం పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు కోటా భాస్కర్‌రెడ్డి శనివారం రూ.25 వేలు విలువైన మైక్‌సెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులైన కృష్ణమ్మ, కోటా వెంకట శివారెడ్డి జ్ఞాపకార్థం మైక్‌సెట్ అందించామని తెలిపారు. దాతలను ఆలయ అర్చకుడు ప్రసన్నకుమార్ సన్మానించారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి సతీమణి రాధిక, గ్రామస్తులు బాలప్ప, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థి మనోహర్‌తో పీడీ రమేష్

కనగానపల్లి: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి మనోహర్ రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీకు ఎంపికైనట్లు పీడీ రమేష్ తెలిపారు. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి బేస్ పోటీల్లో మనోహర్ అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారని పేర్కొన్నారు. త్వరలో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో మనోహర్ పాల్గొంటాడన్నారు. శనివారం పాఠశాల హెచ్ఎం అబ్బాస్, ఉపాధ్యాయులు ఆ క్రీడాకారుడిని ప్రత్యేకంగా అభినందించారు.

ఎయిడ్స్‌పై అవగాహన

నల్లమాడ: స్థానిక కస్తూర్బా పాఠశాలలో జనజాగృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎయిడ్స్ ఎలా సోకుతుంది, ఎలా సోకదు, సోకకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియపర్చారు. హెచ్ఐవీ రోగుల పట్ల వివక్ష చూపకుండా వారిని ఆదరించాలన్నారు. హెచ్ఐవీ ఎయిడ్స్ యాక్ట్ 2017, ఏఆర్‌టీ మందులు, టోల్‌ఫ్రీ నంబర్ 1097 తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయినులు, సంస్థ సిబ్బంది శ్రీవాణి, శిల్ప పాల్గొన్నారు.

రైతు సేవలకు గ్రహణం!

- నిరుపయోగంగా కియోస్క్ యంత్రాలు
- కూటమి ప్రభుత్వంలో నిర్వీర్యమవుతున్న ఆర్బీకేలు



యర్రగుంటపల్లి ఆర్బీకేలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్

నల్లచెరువు: విత్తనం నుంచి పంట విక్రయం వరకూ అన్నదాతలకు ప్రతి అడుగులో అండగా ఉండాలనే ఆశయంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలు నిర్వీర్యం అవుతున్నాయి. విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు ఇలా రైతులకు వ్యవసాయం చేయడానికి కావాల్సిన ప్రతిదీ సమకూర్చేందుకు ఆర్బీకేలు అండగా ఉండేవి. కియోస్క్ యంత్రాల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు వంటివి తెప్పించుకునేవారు. కానీ కొంత కాలంగా సాంకేతిక సమస్యలతో కియోస్క్ యంత్రాలు మూలనపడ్డాయి.

అందని సేవలు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు అండగా ఉండేందుకు మండలంలో 10 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. డిజిటల్ విధానంతో నాణ్యమైన సేవలందించేందుకు ప్రతి ఆర్బీకేలో కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేశారు. పంటలు ఉత్పత్తి చేసే సమయంతో ఉన్న మార్కెట్ ధర వివరాలు తదితర సేవలను రైతులకు ఈ–డిజిటల్ కియోస్క్ యంత్రం ద్వారా సమాచారం అందించేందుకు వీలుంటుంది. ఖచ్చితమైన సమాచారంతో నాడు రైతులు వ్యవసాయ శాఖ ద్వారా అన్ని సేవలూ పొందేవారు. అలాగే వాతావరణ సమాచారం వాతావరణంలో మార్పులు ఏ సమయంలో ఏ పంటలు సాగు చేయాలన్న సమాచారాన్ని ఈ యంత్రంలో పొందుపరిచారు.

ఆర్బీకేలపై నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కేంద్రాలు, కియోస్క్ యంత్రాలు వినియోగంపై నీలినీడలు కమ్ముకున్నాయి. సాంకేతిక లోపం, ఇంటర్నెట్ సమస్యలతో కియోస్క్ యంత్రాలు మూలనపడ్డాయి. దీంతో ఇప్పుడు రైతులు వ్యవసాయానికి ఏది కావాలన్నా ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేసే పేరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల రైతులు, రైతు సంఘం నాయకులు కియోస్క్ యంత్రాల నిరుపయోగం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది.

కొన్నిచోట్ల సమస్యలున్నాయి..

మండలంలోని పది ఆర్బీకేల్లో నాలుగైదు చోట్ల కియోస్క్ యంత్రాలు ఇంటన్‌నెట్ సమస్యతో పని చేయడం లేదు. త్వరలోనే సమస్య పరిష్కరించి వాటిని అందుబాటులోకి తీసుకొస్తాం

– భారతి, ఏఓ, నల్లచెరువు